క్లుప్తంగా

పారిశుధ్య పనులు పర్యవేక్షించండి

నింద్ర: వర్షకాలం కారణంగా పల్లెల్లో అతిసార తదితర వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులను కార్యదర్శులు పర్యవేక్షించాలని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంక్‌లో నీటిని నిలిపిన ప్రతిసారి క్లోరినేషన్ చేసి నీరు సరఫరా చేయాలన్నారు. ప్రతి ఒక్కరు గ్రామా ల్లో పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



వడమాలపేట బాలిక ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు

వడమాలపేట(విజయపురం): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం వడమాలపేట మండల ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. మొత్తం 60 మంది బాలబాలికలు ఈ వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలో పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ఈ నెల 20వ తేదీన బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి ద్రాక్షాయణి తెలిపారు. ప్రధానోపాధ్యాయిని విమల, అరుణ, ఉపాధ్యాయుడు మంజుల, సంధ్య, భారతి, వేలాయుధం, కణ్మలై, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహా సంప్రోక్షణ



కలశ పూజలో భక్తులు

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో సోమవారం శాస్త్రోక్తంగా మహా సంప్రోక్షణ పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, రుత్వికరణం, అంకురార్పణ, వాస్తు పూజలు జరిపించారు. మూలవర్లకు అభిషేకం చేసి కలశ స్థాపన చేపట్టారు. భక్తిప్రపత్తులతో అర్చన, హారతి సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాధాకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, రమేష్ రెడ్డి, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

అరుణగిరిపై కార్తీక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

వెదురుకుప్పం : మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, కుంకుమ, విబూదితో అభిషేకం చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే ఆలయం ఆవరణలోని పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అయ్యప్ప భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

నూతన హాస్టల్ భవనం నిర్మించండి

నింద్ర: ప్రభుత్వ మండల కేంద్రం నింద్రలోని బీసీ ప్రభుత్వ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో నాలుగు సంవత్సరాల నుండి అద్దె భవనంలో విద్యార్థులకు వసతి కల్పించారు. అయితే విద్యార్థులకు పూర్తి స్థాయిలో వసతులు లేవు. మొత్తం 90 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ వసతులు సక్రమంగా లేక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గతంలో 150 మంది విద్యార్థులు ఉండేవారు. అద్దె భవనంలో వసతులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. గ్రామస్తులు, విద్యార్థులు నూతన భవనం నిర్మించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు.



శిథిలావస్థలో నింద్ర బీసీ హాస్టల్ భవనం

సేవలకు సెలవు



కోసలనగరం సచివాలయం

గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనకు గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం నాంది పలికింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థ నిర్వీర్యమై పోయింది. సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు అందడం లేదు. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను రద్దు చేసిన చంద్రబాబు ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా రూపుమాపనుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా వ్యవస్థలో సచివాలయాల ద్వారా సుమారు 500 పైగా సేవలు అందించేవారు. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని, ఆధార్ అప్డేట్ కోసం కూడా ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. – విజయపురం

- కూటమి హయాంలో సచివాలయ సేవలు దూరం
- పింఛన్ల పంపిణీకి పరిమితమైన ఉద్యోగులు
- ప్రభుత్వ సేవలు అందక గ్రామీణుల అవస్థలు
- ఆధార్ అప్డేట్ కోసం విద్యార్థుల ఇక్కట్లు

గత ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన 2000 జనాభా ఉన్న పంచాయతీలకు రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో భారత్ నిర్మాణ్ సేవా(హెల్త్ సెంటర్) కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొన్ని నెలల క్రితం వరకు వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు, లబ్ధిదారుల రాకపోకలతో కళకళలాడిన సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. సచివాలయాల ద్వారా 500 పైగా సేవలు అందించాల్సి ఉండగా ప్రస్తుతం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 1బీలు మాత్రమే తీసుకోవడానికి అవకాశం ఉంది. కనీసం ఆధార్ అప్డేట్ చేసుకోవడానికి కూడా వెసులుబాటు కల్పించలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. విజయపురం మండలంలో మొత్తం 25 పంచాయతీలు, 12 సచివాలయాలు ఉండగా అందులో 90 మంది సచివాలయ ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఆ ఉద్యోగులే దిక్కు

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు సచివాలయ వ్యవస్థపై అడ్డగోలుగా విమర్శలు చేశారు. సచివాలయ ఉద్యోగాలపై అవహేళనగా మాట్లాడారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే నేడు కూటమి ప్రభుత్వానికి దిక్కయ్యారు. గతంలో ఒకటో తేదీన వలంటీర్లు అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువులకు సూర్యోదయం కాకముందే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందించే వారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్లను పక్కన పెట్టి సచివాలయ ఉద్యోగులతో పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. ప్రస్తుతం సంక్షేమ పథకాల అమలు లేకపోవడం, సేవలు నిలిచి పోవడంతో కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. చాలా వరకు సచివాలయ ఉద్యోగులు ఖాళీగా కూర్చొని కాలయాపన చేస్తున్నారు.

ఆధార్ అప్డేట్‌కు అగచాట్లు

విజయపురం మండలంలో ప్రజలు ఆధార్ అప్డేట్ కోసం నానా తంటాలు పడుతున్నారు. నగరి, పుత్తూరుకు పరుగులు తీస్తున్నారు. మండలంలో పన్నూరు సచివాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేశారు. అయితే నేటికీ ఆధార్ మిషన్ రాకపోవడంతో ఆధార్ సెంటర్ ప్రారంభం కాలేదు. దీంతో ఆధార్ సేవలు అందక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పనులు జరగక పోవడంతో అసహనంతో వెనుదిరుగుతున్నారు.

సచివాలయ సేవలు అందడం లేదు

గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని పథకాలు ఇంటి వద్ద పొందేవాళ్లం. ప్రస్తుతం ఏ పథకం అందడం లేదు. విద్యార్థులకు ఆధార్ అప్డేట్ చేయించాలన్నా కష్టంగా మారింది. సచివాలయ సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ అప్డేట్ కోసం నగరి, పుత్తూరుకు పరుగులు తీస్తున్నారు. వెంటనే ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

– కన్నన్, విజయపురం

సహకార సంఘాల బలోపేతానికి కృషి



నగరిలో సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీఆర్ కుమార్

నగరి: దేశవ్యాప్తంగా సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి జరుగుతోందని నగరి బ్రాంచ్ మేనేజర్ కీర్తిసుధ అన్నారు. సోమవారం నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. నగరి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కేవీఆర్ కుమార్ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ప్రతీ ఏటా నవంబరు 14 నుంచి వారం రోజులపాటు సహకార వారోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. 1904లో దేశంలో ఏర్పాటైన సహకార వ్యవస్థ రోజురోజుకూ బలోపేతం అవుతోందని అన్నారు. సంఘ సీఈఓ తులసిపిళ్లై మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో కూడా సహకార సంఘాల ప్రాధాన్యతను పెంచేందుకు తాజాగా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే పెట్రోల్ బంకుల నిర్వహణతోపాటు రైతులకు వ్యవసాయ రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సహకార సంఘాలను కంప్యూటరీకరించే ప్రక్రియను శరవేగంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిద్వారా సహకార సంఘాలపై మరింత నమ్మకం, పారదర్శకత పెరుగుతుందన్నారు. గ్రామీణ స్థాయిలోని సహకార సంఘాలను కేవలం ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, ఇతర కార్యక్రమాలకు కూడా విస్తరిస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు ఆనంద్, వెంకటేష్, శేఖర్, దుర్గా ప్రసాద్, లేపాక్షి, కార్తీక్, తనికాచలం, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న తులసీ యాదవ్, అన్బళగన్

పాలసముద్రం: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పార్టీ ఎస్ఆర్‌పురం మండల కన్వీనర్ తులసీయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. సోమవారం పాలసముద్రంలో కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. మంగళవారం కొత్తపల్లెమిట్టలో పార్టీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి హాజరవుతున్నట్లు వివరించారు. సమావేశానికి పెద్దసంఖ్యలో ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్పప్రకాష్, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్, సర్పంచ్ గాలి మహేష్ బాబు, ఆనంద్‌లిల్లీ, పుత్తూరు కేశవరెడ్డి, లోకిదాస్, కుట్టి, ప్రేమ్ కుమార్, మనోహర్, చిన్నబ్బరాజు, షణ్ముగరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ క్వారీని ఆపండి



డీఆర్ఓకు వినతిపత్రం అందిస్తున్న కీళపట్టు గ్రామస్తులు

నగరి: కీళపట్టు సమీపంలో ఉన్న అక్రమ క్వారీని ఆపాలని గ్రామస్తులు సోమవారం చిత్తూరు జిల్లా డీఆర్ఓ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీళపట్టు సమీపంలో అక్రమ క్వారీ నిర్వహిస్తున్నారని, వాటి నుంచి వచ్చే దుమ్ముధూళితో గర్భవతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అంతే కాకుండా రాత్రి పూట ప్రమాదకరమైన బాంబులు వాడుతున్నారని, అందులో నుంచి వచ్చే శబ్దాలతో నిద్ర ఉండడం లేదన్నారు. గతంలో అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమ క్వారీని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ

పుత్తూరు: ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో ఈ నెల 21వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ చేసిన యువతీ యువకులు అర్హులని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, మార్క్స్ లిస్ట్, జెరాక్సులతో పాటు ఫొటో తీసుకురావాలని తెలిపారు. శిక్షణ పొందిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. వివరాలకు 63009 54441 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగునీటి క్లోరినేషన్ తప్పనిసరి



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ట్యాంకుల క్లోరినేషన్ తప్పనిసరిగా చేయించాలని ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం దళితవాడలోని తాగునీటి ట్యాంకులను ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే ప్రమాదముందన్నారు. అందుకే పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శంకర్ పాల్గొన్నారు.

నేడు చెరుకు సాగుపై అవగాహన

పాలసముద్రం: మండలంలోని రాచపాళ్యంలో మంగళవారం నూతన రకాల చెరకు సాగుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చెరుకు రైతులు సదస్సుకు రావాలని కోరారు.

నేడు నగరిలో జాబ్‌మేళా

నగరి: పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఫెయిల్ లేదా పాస్, బీటెక్ చేసిన, 18 నుంచి 30 వయస్సులోపు యువతీయువకులు అర్హులని తెలిపారు. మరిన్ని విరాలకు 63009 54441, 99635 61755, 95731 04593 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కారానికి కృషి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

బంగారుపాళెం: గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చారు. బర్త్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని, దారి సమస్యలు, వివిధ భూ సమస్యలను పరిష్కరించాలంటూ 23 అర్జీలు వచ్చాయి. ఆయా రెవెన్యూ వీఆర్‌ఓలు చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు.

విద్యార్థులు పఠనం అలవాటు చేసుకోవాలి

బంగారుపాళెం: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు వక్తృత్వ, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతి రోజూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ రకాల పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలు అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు తమ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. విజేతలకు ఈ నెల 20వ తేదీ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు సుశీల, పీఈటీ గిరిజ పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానవంతులు

ఐరాల: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విజ్ఞానవంతులు కావాలని ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారిణి సుజాత అన్నారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించారు. సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు పోటీతత్వం ఉండాలని చెప్పారు. పోటీతత్వం ఉన్నప్పుడే వారిలో సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: తెలుగుభాష గొప్పతనం తెలియాలంటే సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలని రచయిత హరికృష్ణారెడ్డి తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సాహిత్య సదస్సులో మాట్లాడారు. పుస్తకాలు మనిషి జీవితాన్ని ఉన్నత స్థానంలో తీసుకురావడానికి దోహదపడుతుందన్నారు. మానసిక ఉల్లాసానికి ఉపయోగపడుతుందన్నారు. భాష గొప్పతనంపై విశ్రాంత అధ్యాపకులు శ్రీహరి నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు రామకృష్ణ మాట్లాడారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

పుత్తూరు: పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం వ్యాస రచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో స్థానిక ఎంపీయూపీ మెయిన్ స్కూల్, కాపువీధి, పీఎస్‌నగర్, ఎస్ఆర్‌చెరువులకు చెందిన ఎంపీపీ స్కూల్స్, జడ్పీ బాలికల అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి మీనాకుమారి తెలిపారు. కార్యక్రమాన్ని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

విద్యుత్ కార్మికులకు న్యాయం చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హేమకుమార్, రాష్ట్ర అదనపు కార్యదర్శి రూప్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న విజయవాడ విద్యుత్ సౌధలో హెచ్‌ఆర్ కమిటీ సమావేశం జరుగుతోందన్నారు. అందులో తమ డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను గతంలో తమ సమస్యలపై కలిసినప్పుడు తెలంగాణ, తమిళనాడులో విధానాలను పరిశీలించి న్యాయం చేస్తానని హామీనిచ్చిన విషయం గుర్తు చేశారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో విద్యుత్ కార్మికులకు రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం వచ్చాక విద్యుత్ యాజమాన్యం హెచ్‌ఆర్ కమిటీ సమావేశం మొదటిసారి నిర్వహిస్తోందన్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్ కార్మికుల రెగ్యులేషన్‌కి వేసిన కమిటీ నివేదికను పరిశీలించాలన్నారు. ప్రమాద భీమాతో పాటు ఆరోగ్య పాలసీ, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ రూ.20 లక్షలు మంజూరు చేయాలని కోరారు.

పాఠశాలల్లో స్క్రీనింగ్ పరీక్షలు



మాట్లాడుతున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్: నగరంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా చేపట్టిన స్క్రీనింగ్ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. ఆయన సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో అర్బన్ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, అంగన్‌వాడీ పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వయసున్న విద్యార్థులకు పుట్టుకతో వచ్చే వ్యాధులు, పోషకాహార లోపంపై స్క్రీనింగ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ వివరాలను అధికారులకు పంపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్, సహాయ కమిషనర్ ప్రసాద్, సీడీపీవో సునంద పాల్గొన్నారు.

ప్రమాదాల మలుపులు





మహదేవపురం సమీపంలోని ప్రమాదకరమైన మలుపు, పాలసముద్రం బీసీ కాలనీ వద్ద మలుపు

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ–చిత్తూరు జాతీయ రహదారిపై మలుపులు ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ముఖ్యంగా పాలసముద్రం బీసీ కాలనీ, మహదేవపురం మార్గంలో ఉన్న పలువులు ప్రమాదాలకు నిలయంగా మారిపోయాయి. వీటి వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు ఒకదానికొకటి కనిపించడం లేదు. దీంతో ఆయా మార్గాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు తప్పడం లేదు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రమాదాలను నియంత్రించాల్సి ఉంది.

వినతులు పరిశీలించి న్యాయం చేయండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : తమ వినతులు పరిశీలించి న్యాయం చేయాలని పలు ప్రాంతాల అర్జీదారులు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారుల వినతులను పరిశీలించి నిర్దీత గడువులోపు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

భూమి ఆక్రమించుకున్నారు

మాది పూతలపట్టు మండలం వావిల్‌తోట గ్రామం. ఖాతా నెంబర్ 684 సర్వే నెంబర్ 1119లో 3.52 ఎకరాల భూమి నా పేరు మీద ఉంది. ఆ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. హద్దులు చూపించాలని అధికారులను కోరాను. అయినా స్పందించడం లేదు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరాను. – చక్రపాణి

అక్రమంగా కూసాలు నాటారు



నేను పెనుమూరు మండలం పాపిరెడ్డిపల్లి నుంచి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చాను. మా పొలానికి వెళ్లే దారిలో అన్యాయంగా కూసాలు నాటేశారు. చార్యగానిపల్లి సర్వే నెంబర్ 44/1, 44/2, 44/6, 44/8లో రెండు ఎకరాల భూమి ఉంది. తమ పొలానికి వెళ్లే బండిబాట, నీటి కాలువను దౌర్జన్యంగా నాశనం చేసి ఇనుప కూశాలను నాటారు. ఇదేమిటని ప్రశ్నిస్తే దాడి చేసేందుకు వస్తున్నారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

– ఇరగమ్మ

వితంతు పింఛన్ అందించాలి



నేను చిత్తూరు నగరం ఇరువారంలోని సీబీఎస్ కాలనీలో నివాసం ఉంటుంటాను. వితంతు పింఛన్ మంజూరు కోసం ఎన్ని సార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గతంలో పింఛన్ ఇచ్చేవారు. ఆధార్ లింక్ లేదని పింఛన్ ఇవ్వడం మానేశారు. న్యాయం చేసి పింఛన్ తిరిగి మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరాను.

– కుమారి

కొత్త రేషన్ కార్డు ఇప్పించండి



మాది చిత్తూరు మండలం తుమ్మింద పాళ్యం. నా భర్త అనిల్ కుమార్‌కు రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో వెన్నెముక విరిగింది. అప్పటి నుంచి నడవలేక మంచానికే పరిమితమయ్యారు. దివ్యాంగుల పింఛన్‌కు దరఖాస్తు చేయాలంటే రేషన్‌కార్డు అడుగుతున్నారు. కొత్త రేషన్‌కార్డు కోసం అధికారుల చుట్టూ ఎన్ని సార్లు తిరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కొత్త రేషన్‌కార్డు మంజూరు చేయించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాం.

– వెన్నెల

ఇళ్లకు వెళ్లేదారిని ఆక్రమించుకుంటున్నారు



మాది చిత్తూరు రూరల్ తుమ్మింద పాళ్యం గ్రామం. మా తుమ్మిందపాళ్యం ఎన్‌టీఆర్ కాలనీలో 10 కుటుంబాలు నివస్తున్నాయి. మా ఇళ్లకు వెళ్లే దారిలో కొబ్బరి మొక్కలు నాటి ఆక్రమించుకుంటున్నారు. ఎందుకు ఇలా చేస్తున్నారని అడిగితే దాడికి దిగుతున్నారు. పరిశీలించి మాకు న్యాయం చేయాలని కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చాం.

– శివకుమార్, అర్జీదారుడు.